
ఆంధ్రప్రదేశ్ పత్రిక వారి 'దీపావళి హాస్య కథల పోటీ - 2012'లో
ప్రథమ బహుమతి పొందిన కథ

# రేపింతే !



"వ్వాట్ ! త్రీడేస్ లీవా ? ఇటీజ్ జస్ట్ ఇంపాజిబుల్ !" లీవ్ లెటర్ని విసరి కొట్టారు శ్రీధర్‌రావు.

"ప్లీజ్ సర్. ఇది లైఫ్ అండ్ డెత్ సమస్య !" దీనాతిదీనంగా మొఖం పెట్టి అన్నాడు చిదానందం.

అయినా సరే ఆయన, "ఠల్ ! వీల్లేదు. నో. నహీఁ !" అని అరిచారు.

"ఎగ్జామ్‌కి ప్రిపేవర్వాలి సర్. బోల్డంత సిలబస్ కవర్ చెయ్యాలి. ఎలాగైనా బెస్ట్ ర్యాంక్ తెచ్చుకోవాలి....!" కళ్ల నీళ్ళ పర్యంతమయ్యాడు.

ఆయన మెదడు దేనికో 'కనెక్షన్' ఇచ్చింది. ఆరాగా చూశారు.

"ఏం ఎగ్జామ్ ?"

"మీట్.... మ్యారేజ్ ఎలిజిబిలిటీ ఎంట్రన్స్ టెస్ట్......వరుళ్ళ ప్రవేశ పరీక్ష అంటున్నారే అదే సర్....!

"ఓ....! నీకింకా పెళ్లి కాలేదు కదూ. సో... యూ ఆర్ సీరియస్ ఎబౌట్ టెస్ట్?!"

"బోత్ టెస్ట్ అండ్ మ్యారేజ్ సర్....!"

"ఓకే మేన్. ఒన్ వీక్ లీవ్ శాంక్షన్ చేస్తున్నాను ఫో....!

"సార్ !" తన చెవుల్ని నమ్మలేక చెవుల దిబ్బడ వదిలిపోయేలా అరిచాడు.

శ్రీధర్‌రావు జాలిగా చూస్తూ అన్నారు "సమాజంలో మీపై ఎలాంటి వివక్ష కొనసాగుతోందో గ్రహించగలను. సీరియస్‌గా ప్రిపేరవ్వు. ఆల్ ద బెస్ట్ !"

"థాంక్యూ థాంక్యూ సర్...." గబుక్కున వంగి ఆయన కాళ్లకి దండం పెట్టి క్యాబిన్లోంచి బయట పడబోయాడు.

"చిదానందం !" రహస్యం చెప్పడానికన్నట్టు చిన్నగా పిలిచారు.

ఫ్యాన్ గాలికి ఆయన మనస్స మారిపోయిందేమోనని భయపడ్డాడు. ఏడుపు ముఖం పెట్టుకొని బిక్కు బిక్కుమని చూశాడు.

"కోఠి వెళ్తే అక్కడ ఈ ఎంట్రన్స్ టెస్ట్ కేవో గైడ్స్ అమ్ముతున్నార్ట. ఓ సెట్ కొనుక్కురావోయ్.... మా అబ్బాయీ రాస్తున్నాడు !"

ఆయన దీనంగా మొహం పెట్టారు. ఈసారి చిదానందం జాలిగా చూశాడు.

తలాడించి బయటపడ్డాడు. ఫైల్లోని అక్షరాలు కన్పించట్లేదు.

రాయబోయే క్వశ్చన్ పేపరే కళ్ళముందు వివిధ రంగుల్లో రూపాల్లో ప్రత్యక్షమవుతోంది!

సిలబస్ ప్రకారం 'ఆడవారిని సంతోషపెట్టడానికి వంద చిట్కాలు' 'ఇంటి పనీ బయట పనీ భార్య మెచ్చేలా చేయడం ఎలా?' 'భార్య చేత మంచి భర్త అనిపించు కోవాలంటే?' 'గర్భిణీల సహాయకుడి లక్ష్య లక్షణాలు' 'పిల్లల్ని పెంచడం ఓ కళ' అనే పంచరత్నాలని కొని నములుతూ మ్రింగుతున్నాడు.

వీటితో బాటు గైడ్సునీ తిరగేస్తే అద్భుత ఫలితం రావొచ్చు. ఏ రాళ్ళ గుట్టలో ఏ

జాతిరాయి వుందో ఎవరికి తెలుసు?!

మనస్సులోనే శ్రీధరరావు గారికి కృతజ్ఞతలు చెప్పి బైక్ బయటికి తీశాడు.

కోఠి లోని అన్ని పుస్తకాల షాపుల ముందూ వరుళ్ల ఎంట్రన్స్‌టెస్ట్ గైడ్లు, మోడల్ పేపర్లు, ఇంటర్వ్యూ టిప్స్-లభించునంటూ పెద్ద పెద్ద బ్యానర్లు వ్రేలాడుతున్నాయి.

ఒక షాపులోకి వెళ్ళాడు. చిదానందం ముఖం చూస్తూనే సేల్స్‌మేన్ ఇంతింత లావు పాటి పుస్తకాలు అతడి ముందు పెట్టాడు.

తిరగేస్తోంటే, "అన్నీ ప్రముఖ పబ్లిషర్లవే. ఒక్కోటీ వేల కాపీలు అమ్మేం" అన్నాడతడు.

పోటీ తీవ్రత అర్థమైంది. రెండు పెద్ద పుస్తకాలు ఒక్కోటీ రెండు కాపీలు చొప్పున కొన్నాడు.

"ఇవి వద్దా ?" అంటూ 'మెడికల్ టెస్టులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు' 'వరుడి ఇంటర్వ్యూలో తెలివిగా జవాబివ్వండి' అనే మరో రెండు బుక్స్ చూపించాడు.

'ప్రవేశ పరీక్ష పాసయ్యాక కదా !' అనుకోబోయి, 'అపశకునపు ఆలోచన !' అని దాన్ని కొట్టి పారేసి అవీ తీసుకున్నాడు.

చిదానందం కాన్ఫిడెన్స్ లెవెల్ 90 శాతానికి పెరిగింది.

'టాప్ థౌజండ్ లో ర్యాంక్ ఖాయం. ఇక తన జీవితం మారిపోతుంది. పగలే వెన్నెల కాస్తుంది. రాత్రుళ్లు మల్లెల సుగంధపు గాలి వీస్తుంది. నాకూ ఆడపిల్లలు పుడతారు. నా జన్మ చరితార్థమవుతుంది' అనుకున్నాడు.

'వివాహంలోనే ఉంది మగజన్మ సార్థకం, నాన్నా అన్పించుకోని జీవితం వ్యర్థం...!' అని పాడుకొంటూ లెగ్ కదిలించబోతోంటే హనుమంతుడి తోక లాంటి క్యూ కన్పించింది.

అక్కడికి జంప్ చేసి, "దేని గురించీ ఈ క్యూ?" అని పీల గొంతుతో పెద్దగా అడిగాడు.

అతడు ఇతడి చెవిలో బ్రహ్మరహస్యం ఊదాడు.

ఎంట్రన్స్ పేపర్ లీకయ్యిందట !

చటుక్కున క్యూలో దూరి వెయ్యి రూపాయలు పెట్టి ఒక్క పేపరే కొన్నాడు. బాసు సంగతి గుర్తున్నా పోటీ పెంచుకోవడం ఎందుకనుకున్నాడు.

ప్రక్కనే వున్న హోటల్లో కెళ్ళి ఓ కార్నర్ టేబుల్ దగ్గర బైఠాయించి ఎవరూ తనని గమనించకుండా, గమనించినా తెలీకుండా ఓ న్యూస్ పేపర్ మధ్య 'లీకు' పేపర్ని ఇరికించి ఆత్రంగా ప్రశ్నల్ని తడిమాడు.

'మీ భార్యకి నగల సేకరణ హాబీ. మీరు ప్రోత్సహిస్తారా? లేదా?'

'మీ భార్య నిండు గర్భిణి. పురిటి నొప్పుల బాధ తాళలేకపోతోంది. ఆమె బాధని మీరెలా షేర్ చేసుకుంటారు?'

'బొంబిడాయిల పులుసు వండే విధానం తెలుపుడు'

'వరవిష్ణు పూజని మగాళ్లు తప్పనిసరిగా చేయడం వెనుకగల మహత్తర ఉద్దేశం ఏమిటి?'

'కోపించిన భార్యని ప్రసన్నం చేసుకోవడమెలాగో సరస సుమధుర సంభాషణల్తో వివరించండి'

'మీకు వచ్చిన మూడు జోల పాటలు రాయండి'

చిదానందం నోటి తడారిపోయింది. ఒళ్ళు ముచ్చెమటల్తో తడిసి ముద్దవుతోంటే 'వీటికి సరియైన సమాధానాలు సంపాదించడం ఎలా?' అని టెన్షన్ పడుతోంటే మొబైల్ మోగింది.

"హలో నందా, ఈ టైంలో ఫోన్ చేశావేంటి? సినిమా ప్రోగ్రామా?"

"సినిమాకో గోలీమారో, టెస్ట్ టెన్షన్తో ఛస్తున్నాను తెలుసా?"

"నా పరిస్థితీ డిటోయే. పెళ్లవ్వాలంటే ఎంట్రన్స్ పాసై తీరాలి"

"అందుకే కదరా బర్త్‌డే వస్తోందంటే హడలి చస్తున్నాను. నలభై దాటిందో ఏజ్ బార్ అవుతుంది. టెస్ట్‌కి ఎలిజిబిలిటీ పోతుంది!" ఫోన్లోనే ఏడ్చేశాడు నందా.

"నువ్వు మెరిట్‌వి. ర్యాంక్ వస్తుంది. ధైర్యంగా వుండు...."

"కార్పొరేట్ కాలేజీ వారి క్రాష్ కోర్సులో చేరాను. వాళ్ళకి గతంలో చాలా ర్యాంకులొచ్చాయిలే. కానీ...లాస్ట్ ఛాన్స్ కదురా....!" మళ్ళీ ఏడ్చేశాడు.

"గట్టిగా ఏడవకురా నాకూ ఏడుపు వచ్చేస్తోంది. అన్నట్టు నీకో న్యూస్‌రా. బ్లడ్ టెస్ట్, హెచ్ఐవి టెస్ట్ వగైరా మెడికల్ టెస్ట్‌లేవీ చెయ్యకుండానే చక్కని మెడికల్ రిపోర్టిస్తున్నార్ట. ప్యాకేజ్‌కి పదివేలవుతుందిట...."

"నీకింకా తెలీదా? ఆ టెస్టులు స్పెసిఫైడ్ హాస్పటల్స్‌లోనే చేయించాలని కొత్త కండిషన్ పెట్టారు. పేపర్లో వచ్చింది"

"చచ్చేం. మగాడిగా పుట్టేకన్నా మహారణ్యంలో పిచ్చి మొక్కగా పుట్టడం బెటర్రా"

"నువ్వు కనీసం ఆన్‌లైన్లోనన్నా కోచింగ్ తీసుకోరా. జస్ట్ 35% వస్తే చాలదు. ర్యాంకు తెచ్చుకోవాలి. టెస్టులో 70% దాటితేనే తమకి అప్లై చేయమంటున్నారు సాఫ్ట్‌వేర్ గాళ్స్!"

"ఇంక చాలురా బాబూ, బీపీ పెరుగుతోంది....!"

"నువ్వే అలా అంటే ఇంక నేనేమై పోను చెప్పు? నాకసలే లాస్ట్ ఛాన్స్!" మళ్ళీ ఓ ఏడ్పు ఏడ్చి ముక్కు చీది అన్నాడు 'చెలీ! నీ సఖుడ్ని నేనే' అని ఇ – బుక్ రిలీజయ్యిందిరా. మంచి పాయింట్లున్నాయి. వెంటనే డౌన్‌లోడ్ చేసుకో"

డీలాపడి ఇంటికొచ్చిన చిదానందాన్ని చూసి అతడి తల్లి లబలబలాడింది.

“తోటకూర కాడలా వడలి పోయావేంట్రా ! ఆ పరీక్ష కాదుగాని నీ ప్రాణాలు తోడేస్తోందనుకో. వీటికన్నా మత్స్యయంత్రాన్ని ఛేదించమన్నా, విల్లు విరవమన్నా బావుండేది!” ఎనర్జీ డ్రింకు గ్లాసులో పోసిస్తూ అంది.

“అవి భుజబల పరీక్షలు. ఇవి బుద్ధిబల టెస్టులు. ఇవాళ్టి గాళ్స్‌కి తను చేసుకోబోయే వాడు బుద్ధిమంతుడు, ఆరోగ్యంతుడు, తెలివైనవాడు, హాస్యసంభాషణా చతురుడు, చక్కగా సర్దుకుపోగలవాడుగా ఉండాలని కోరుకుంటున్నారు. భార్యని పువ్వుల్లో పెట్టి చూసుకునే వాడే కాదు, పిల్లల ఆలనా పాలనా చూస్తూ హెూం వర్కు చేయించేవాడు కావాలంటున్నారు. సంపాదన తక్కువైనా ఫర్లేదంటున్నారు”

“వాళ్ళు బాగా సంపాదిస్తున్నారుగా! ఏవిటోరా. మా కాలంలో ఇలా ఉండేదే కాదు. ఇంట్లో మగపిల్లాడున్నాడంటే చాలు ఆడపిల్లల తండ్రులు క్యూ కట్టేవారు. లక్షలకి లక్షలు కట్నం ఇచ్చేవారు. అయినా కొందరు కట్నాకలితో కిరసనాయిలు పోసి తగలబెట్టేవారు. గర్భంలో వున్నది ఆడపిల్ల అని తెలిస్తే చాలు భ్రూణ హత్య చేసేసే వాట్రా!”

“ఆ ఘాతుకాలే మాకు శాపాలై మా కొంప కొల్లేరు చేశాయి. ఇప్పుడు పదిమంది మగాళ్ళకి ఆరుగురే ఆడవాళ్ళున్నారు. మీకు ముందు చూపుండి వుంటే మేం మగమహారాజుల్లా కాలర్ ఎగరేసే వాళ్ళం. కనీసం అర్హత పరీక్షల బెడద వుండేది కాదు. ఒంటిమీదకి 38 ఏళ్ళొచ్చినా పెళ్లి కాకుండా ఇలా ముదిరిపోయే వాళ్ళమూ కాదు!” తన ఆక్రోశాన్ని వెలిగ్రక్కాడు.

“నిజమేరా. ఒక్క ఆడపిల్లని కనివుంటే ఇప్పుడు నేను మహారాణి వైభోగం వెలగబెట్టే దాన్ని కాదూ!” నిట్టూరుస్తూ అంది.

“నువ్వా అనుకుంటున్నావూ! సరిపోయింది!”

“నువ్వా....!”

తలొంచుకున్నాడు చిదానందం.

“తక్కువ పూజలు చేసి ఎక్కువ ఫలం రావాలంటే ఎలా వస్తుంది చెప్పు. వచ్చే జన్మలోనైనా ఆడపిల్లగా పుట్టాలని కోరుకో. అన్నట్టోరేయ్ ఇంతక్రితం టీవీలో చెప్పేర్రా. వరుళ్ళ ప్రవేశ పరీక్ష రాసేవాళ్ల సంఖ్య బాగా పెరగటంతో కటాఫ్ మార్కు యాభైకి పెంచార్ట.....!

ఆమె మాటలు పూర్తి కాకుండానే స్పృహ తప్పిందా పూర్ మగాడికి!

**(ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక, డిసెంబర్ 2012)**
**(కన్నడంలోకి అనువదింపబడినది)**